క్లుప్తంగా

టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం లోకిని శారద

సిరిసిల్ల ఎడ్యుకేషన్: సదిశ ఫౌండేషన్ టాలెంట్ టెస్ట్‌లో పట్టణంలోని గీతానగర్ బాలికల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి ఇంటర్ విద్య చదివించుకు ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయురాలు లోకిని శారద తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో నిర్వహించిన సదిశ ఫౌండేషన్ టాలెంట్ టెస్టులో మంచికట్ల సాహితీ, వెంగల అక్షిత ఎంపికయ్యారని, వీరికి ఫౌండేషన్ తరఫున శ్రీ చైతన్య కళాశాలలో రెండేళ్ల ఉచిత విద్య హాస్టల్ వసతి కల్పించనున్నట్లు తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాధారాణి, స్వప్న, రజిని బాహుమతులు అందించి అభినందించారు.

పర్వతారోహణ కోర్సు పూర్తి చేసిన విద్యార్థికి అభినందన



విష్ణును అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కోనరావుపేట: మండలంలోని మరిమడ్ల ఏకలవ్య గురుకుల పాఠశాల విద్యార్థి పర్వతారోహణ కోర్సును పూర్తిచేసినట్లు ప్రిన్సిపాల్ రామ్‌సూరత్ యాదవ్ తెలిపారు. మనాలకు చెందిన జి.విష్ణు మరిమడ్ల పాఠశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. అటల్ బిహారీ వాజ్‌పాయ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మౌంటినెరింగ్ అండ్ అలైడ్ స్పోర్ట్స్ (ఏబీవీఐఎంఏఎస్) ఆధ్వర్యంలో మనాలిలో శీతాకాలం సందర్భంగా 28 రోజుల పర్వతారోహణ కోర్సు ఏర్పాటు చేశారు. ఈ కోర్సును విష్ణు విజయవంతంగా పూర్తిచేశాడు. విష్ణుకు ఏబీవీఐఎంఏఎస్ డైరెక్టర్ కిట్టు మెమెంటోను అందజేశారు. ప్రిన్సిపాల్ రామ్ సూరత్ యాదవ్, పీఈటీ సుధాకర్, అధ్యాపకులు అభినందించారు.

పెద్దచెరువు ఆయకట్టుకు సాగునీరందిస్తాం



కెనాల్‌ను పరిశీలిస్తున్న ఈఈ అమరేందర్

ముస్తాబాద్: మండలకేంద్రంలోని పెద్ద చెరువు ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందిస్తామని ఇరిగేషన్ ఈఈ అమరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలోని పెద్దచెరువు లీకేజీతో నీరు వృథాగా పోతుందని ఆయకట్టు రైతులు ఫిర్యాదు మేరకు ఇరిగేషన్ అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. చెరువు కింద ఉన్న నీటికాల్వల నుంచి వృథాగా పోతున్న నీటిని అధికారులు పరిశీలించారు. కాల్వలను పునరుద్ధరించి, పంటలకు నీరు అందిస్తామని అధికారులు తెలిపారు. డీ ఈ రవికుమార్, రామ్, దేవరాములు తదితరులున్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

వేములవాడఅర్బన్: పట్టణంలోని న్యూఅర్బన్ కాలనీ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాధికారి బన్నాజీ మంగళవారం తనిఖీ చేసి హాజరుశాతాన్ని పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మోనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నారు.

కాంగ్రెస్‌ను విమర్శించే అర్హత హరీశ్‌రావుకు లేదు



వేములవాడరూరల్: బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రాజన్న ఆలయాభివృద్ధికి ఏటా రూ.100కోట్లు మంజూరుచేస్తామని మాట ఇచ్చిన మాజీ సీఎం కేసీఆర్ మంజూరుచేయలేదని, కాంగ్రెస్‌ను విమర్శించే అర్హత మాజీ మంత్రి హరీశ్‌రావుకు లేదని వేములవాడ రూరల్ పార్టీ అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశ్ గౌడ్ అన్నారు. మంగళవారం రూరల్ పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. రేవంత్‌రెడ్డిపై మాట్లాడే ముందు మీ నాయకుడు రాజన్న ఆలయం ముందు ఇచ్చిన హామీలను గుర్తు చేసుకోవాలన్నారు. మిడ్‌మానేరు నిర్వాసితులకు రూ.5లక్షల 4 వేలు ఇస్తామని మోసం చేశారన్నారు. కాళేశ్వరం అవినీతి బయటపడుతుందనే రాజన్నను దర్శించుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

తాత్కాలిక రోడ్డు ఏర్పాటు



వీర్నపల్లి: మండలంలోని అడవి పదిర గ్రామం వాగుపై బ్రిడ్జి నిర్మాణం జరుగుతోంది. దీంతో గ్రామస్తులు, రైతులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో గ్రామస్తులు మంగళవారం తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ..ధాన్యం బస్తాలు తరలించేందుకు, లారీలు వచ్చేందుకు తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. కాంట్రాక్టర్‌కు పలుసార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో గ్రామ రైతులు మహిళాసంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైకే చెట్లకొమ్మలు



కోనరావుపేట: మండలంలోని రామన్నపేట రహదారిపైకి చెట్ల కొమ్మలు రావడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కొలనూర్ నుంచి రామన్నపేట గ్రామానికి వెళ్లేందుకు తారు రోడ్డు ఉంది. రోడ్డు పక్కన చెట్లకొమ్మలు ఏపుగా పెరిగి రోడ్డు మీదకు రావడంతో రోడ్డు చిన్నగా మారుతోంది. ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి రహదారిపైకి వస్తున్న కొమ్మలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

సర్వే మార్గదర్శకాలు పాటించాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్లటౌన్: ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని 17, 28వ వార్డుల్లో చేపడుతున్న సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వేలో తీసుకుంటున్న సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. సమాచారం ఇవ్వడంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అంటూ గృహవాసులను తెలుసుకుని మాట్లాడారు. సర్వే మార్గదర్శకాలను తూచ తప్పకుండా పాటిస్తూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు సర్వేపై ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేయాలన్నారు. ఏ ఒక్క కుటుంబాన్ని వదిలిపెట్టకుండా సర్వే చేపట్టాలంటూ, ప్రజలు కూడా అధికారులకు సహకారం అందించాలని కోరారు. కలెక్టర్ వెంట ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ దుబ్బాక లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం రవాణాకు అనుమతించాలి

గంభీరావుపేట: మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం రవాణా చేసేందుకు ట్రాక్టర్లకు అనుమతించాలని కోరుతూ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కొమిరిశెట్టి విజయ ఆధ్వర్యంలో రైతులు మంగళవారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు వినతిపత్రం అందించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హమీద్, జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, ట్రాక్టర్ల యజమానులు పాల్గొన్నారు.

మద్దతివ్వండి .. బాధ్యతగా పనిచేస్తా



సాయిశ్రీ కళాశాల అధ్యాపకులతో యాదగిరి శేఖర్‌రావు

సిరిసిల్ల కల్చరల్ : రానున్న శాసన మండలి ఎన్నికల్లో తనకు మద్దతిచ్చి గెలిపిస్తే పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి బాధ్యతగా పని చేస్తానని ట్రస్మా రాష్ట్ర శాఖ పూర్వ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు అన్నారు. మంగళవారం ఆయన సిరిసిల్లలో పలు ప్రైవేట్ విద్యాసంస్థల ఉపాధ్యాయులతో భేటీ అయ్యారు. జూనియర్ కళాశాల, బతుకమ్మ ఘాట్ వద్ద వాకర్లను కలిసి మద్దతు ఇవ్వాలని కోరారు. పట్టణంలో నేతన్నల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరి సరికాదన్నారు. ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన దంపతులు అమర్, స్రవంతి కుటుంబాన్ని పరామర్శించారు. పిల్లల చదువుకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పలు పాఠశాలలు, ప్రైవేట్ జూనియర్, డిగ్రీ కళాశాలలను సందర్శించి అధ్యాపకుల మద్దతును కోరారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా, పట్టణాధ్యక్షులు నాగుల శ్రీనివాస్, ఎల్లె శ్రీనివాస్, ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులు భాస్కర్‌రెడ్డి, రాధాకృష్ణప్రసాద్, బుచ్చారావు, వై శ్రీనివాస్, శంకర్‌రావు, రాజిరెడ్డి, జగన్ గౌడ్, చిలుక కిరణ్, తిరుపతి, రాజాభాను తదితరులు పాల్గొన్నారు.

కులగణనతో అన్ని వర్గాలకు న్యాయం



సర్వేను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తంగళ్లపల్లి: ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సమగ్ర సర్వేతో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో జరుగుతున్న ఇంటింటి సర్వేను కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ఎన్యూమరేటర్లతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టోని మాట్లాడుతూ ప్రతిపక్షాల బూటకపు మాటలు నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల ఏఎంసీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, కాంగ్రెస్ నాయకులు పెద్దూరి తిరుపతి, రెడ్డి పరుశరాములు, కొత్త రవీందర్, పయ్యావుల శ్రీకాంత్, బండి యోగి, వివేక్, విజయ్ తదితరలు పాల్గొన్నారు.

మంత్రి పొన్నంను కలిసిన నాయకులు



మంత్రి పొన్నంతో కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిశారు. హుస్నాబాద్‌లో మంగళవారం నిర్వహించిన సత్యనారాయణపూజ సందర్భంగా మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, మార్కెట్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ గుండాడి రాంరెడ్డి, డైరెక్టర్ మెండేటి శ్రీనివాస్ ఉన్నారు.

హరీశ్‌రావుకు సన్మానం



తంగళ్లపల్లి: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు మంగళవారం కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ పాదయాత్రకు మద్దతు తెలిపేందుకు వెళ్తుండగా తంగళ్లపల్లి బీఆర్‌ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, నాయకులు మాట్ల మధు, అంకారపు రవీందర్, కొయ్యడ రమేశ్, క్యారం జగత్, కొండ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు, వైద్య సిబ్బంది

గంభీరావుపేట: మండలంలోని లింగన్నపేట, కొత్తపల్లి గ్రామస్తులకు పోలీస్, వైద్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. వైద్యాధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ ఎవరైనా గుండెపోటుకు గురైతే సీపీఆర్ చేసి ప్రాణాపాయం తప్పించవచ్చన్నారు. అందరూ సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రమేశ్, ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● **కుటుంబ సర్వే గడువు పెంచాలి**

వేములవాడఅర్బన్: ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే గడువు పెంచాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మేడారం హరికృష్ణ అన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ... సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఒక్కో కుటుంబానికి అన్ని వివరాలు నమోదు చేసేందుకు ఎక్కువ సమయం పడుతుందన్నారు. ఎన్యూమరేటర్లకు ఇళ్ల సంఖ్యను తగ్గించి అదనపు ఎన్యూమరేటర్లను నియమించాలని కోరారు. కార్తీక పౌర్ణమి రోజున సర్వేకు సెలవు ప్రకటించాలని కోరారు.

● **గుండెపోటుతో సింగిల్‌విండో డైరెక్టర్ మృతి**

కోనరావుపేట: మండలంలోని శివంగాలపల్లి గ్రామానికి చెందిన సింగిల్‌విండో డైరెక్టర్ ఉప్పుల బాల్‌రెడ్డి (59) గుండెపోటుతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన బాల్‌రెడ్డి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో ఆరబోశాడు. మంగళవారం సాయంత్రం ధాన్యంపై పరదా తీస్తుండగా గుండెపోటుకు గురయ్యాడు. తోటి రైతులు వెంటనే సిరిసిల్లలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. మృతుడికి భార్య భూమవ్వ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

● **బాధ్యతలు స్వీకరణ**

ఎల్లారెడ్డిపేట: మండల పశువైద్యాధికారిగా జంపాల రాహుల్ మంగళవారం పూర్తిస్థాయి బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ జిల్లాకు చెందిన రాహుల్ మండల పశువైద్యాధికారిగా బాధ్యతలు తీసుకున్నారు. రాహుల్‌కు వీర్నపల్లి మండల పశువైద్యాధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

● **'గాలికుంటు' నివారణ టీకాలు**

కోనరావుపేట: మండలంలోని కనగర్తిలో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. పశువైద్యాధికారి సాహితి, కరీంనగర్ డెయిరీ చైర్మన్ జిల్లెల్ల లక్ష్మారెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ అనుపాటి భూంరెడ్డి, మాజీ సర్పంచ్ అనుపాటి బాపురెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ తిరుపతిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

● **అన్ని వడ్లకు బోనస్ ఇవ్వాలి**

బోయినపల్లి: రైతులు పండించిన అన్ని రకాల వడ్లకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇవ్వాలని సీపీఎం మండల కన్వీనర్ గురజాల శ్రీధర్ పేర్కొన్నారు. మండలంలోని నీలోజిపల్లిలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అన్ని రకాల వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు కేవలం సన్నవడ్లకు బోనస్ ఇస్తామని చెప్పడం సరికాదన్నారు. కార్యక్రమంలో సింగిరెడ్డి శంకర్, అనుముల రవి, ఎర్ర నాగరాజు, ఆవుల మల్లయ్య, ఆవుల రాములు, రవి తదితరులు ఉన్నారు.

● **గంజాయి కేసులో వ్యక్తి అరెస్ట్**

కోనరావుపేట: మండలంలోని సుద్దాల శివారులో కావేరి కాటన్ మిల్ వద్ద గతంలో గంజాయి అమ్ముతూ పరారీలో ఉన్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. సుద్దాల మిల్లువద్ద కొన్ని రోజుల క్రితం గంజాయి విక్రయిస్తూ సుద్దాలకు చెందిన వడ్లూరి వెంకటేశ్‌ను పట్టుకోగా, నిజామాబాద్ జిల్లా భీంగల్‌కు చెందిన మరో వ్యక్తి ఎం.ఏ ఫాసి పరారయ్యాడు. అప్పటినుంచి గాలిస్తున్న పోలీసులకు ఇంటి వద్దే ఉన్నాడన్న సమాచారం అందింది. ప్రత్యేక బృందంతో వెళ్లి అతడిని పట్టుకున్నారు. ఫాసిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. యువత డ్రగ్స్, గంజాయి వంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.

● **రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు**

సిరిసిల్ల అర్బన్: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం... ఇద్దరు యువకులు వేములవాడ వైపు నుంచి పెద్దూరు వైపు వెళ్తుండగా బైక్ అదుపుతప్పి కల్వర్టులో పడటంతో రుషికేష్ (20)కి స్వల్పగాయాలు కాగా, స్థానికులు సిరిసిల్లలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

● **శోభాయాత్ర**

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని సత్సంగ సదనం మంగళవారం రామనామ స్మరణతో మార్మోగింది. సత్సంగ సదనం వ్యవస్థాపకులు గోవిందరాజుల శతజయంతి సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రం నుంచి రాచర్లగొల్లపల్లి వరకు శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలపించిన భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి. జగిత్యాలకు చెందిన పండితులు శ్రీ నంబి వేణుగోపాలచార్యులు భాగవత సప్తాహం బోధించారు. అంతకుముందు భక్తులు స్వయంగా రాసిన శ్రీరామకోటి ప్రతులను శ్రీరామకోటి స్తూపంలో సమర్పించారు. కార్యక్రమంలో సత్సంగ సదనం అధ్యక్షుడు బ్రహ్మచారి లక్ష్మారెడ్డి, సమీప గ్రామాలకు చెందిన దాదాపు వంద మంది భక్తులు పాల్గొన్నారు.

● **పురస్కారం అందజేత**

ఇల్లంతకుంట: మండలంలోని ముస్కానిపేటకు చెందిన కవి తునికి తిరుపతి ఆంధ్రాలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని పురస్కారం అందుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఆది కవి నన్నయ యూనివర్సిటీ, శ్రీ శ్రీ కళావేదిక సంయుక్తంగా విశ్వవిద్యాలయం సెమినార్ హాల్‌లో ఈనెల 9న నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని పురస్కారం అందుకున్నారు. తిరుపతి చేసిన కవిత గానానికి పురస్కారం లభించింది. యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ జ్యోతిర్మయి, శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్ తిరుపతిని సత్కరించి మెమెంటో అందజేశారు.

● **మైక్‌సెట్ వితరణ**

ఇల్లంతకుంట : మండలంలోని దాచారం జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాఠశాలకు మైక్‌సెట్ మంగళవారం ప్రధానోపాధ్యాయురాలికి అందజేశారు. రూ.18, వేల విలువగల మైక్‌సెట్‌ను కొనుగోలు చేసి పాఠశాలకు అందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రాణి, ఉపాధ్యాయులు నరేందర్ రెడ్డి, శ్రీనివాస్, దావీద్, ఆనంద్ కుమార్, సురేశ్, సంజీవ్, శ్రావణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి గ్రామంలో మహిళా సంఘం భవనానికి మోక్షం లభించడం లేదు. 12 ఏళ్లక్రితం అప్పటి ఎమ్మెల్యే నిధులతో నిర్మాణం ప్రారంభించగా కేవలం గోడలవరకే పూర్తికాగా నిర్మాణం నిలిచిపోయింది. ఎవరూ పట్టించుకోకపోవడంతో గోడల చుట్టూ మొక్కలు పెరుగుతున్నాయి. ఇప్పటికైనా భవనాన్ని పూర్తిచేసి సంఘం భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : డీఆర్డీవో, ఇన్‌చార్జి డీపీవో రాజన్న సిరిసిల్ల, ఫోన్ నంబర్: 9640471540

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

క్రీడలతో మానసికోల్లాసం



క్రికెట్ విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న చక్రపాణి

సిరిసిల్లటౌన్: క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక దృఢత్వం కలగుతుందని డిస్ట్రిక్ట్ ప్రీమియం లీగ్ సీజన్–3 స్పాన్సర్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి అన్నారు. స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో 15రోజులుగా జరిగిన క్రికెట్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. ట్రోఫీ ప్రదానోత్సవానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా క్రీడాకారులు పది టీంలుగా పాల్గొన్నారన్నారు. ట్రోఫీ విన్నర్‌గా సిరిసిల్లకు చెందిన అంకం వారియర్స్, రన్నరప్‌గా వ్యాలీ ఎలెవన్ జట్లు నిలువగా వారిని అభినందించి ట్రోఫీ అందజేశారు. విన్నర్ జట్టుకు రూ. 40వేలు, రన్నరప్ జట్టుకు రూ. 20వేలు నగదు బహుమతిని అందజేశారు. అర్బన్ బ్యాంకు చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు గెంట్యాల శ్రీనివాస్, కల్లూరి రాజు, దూస వినయ్, గుండ్లపెల్లి పూర్ణచందర్, ట్రోఫీ ఆర్గనైజర్లు జిందం ప్రశాంత్, దూస రాహుల్, వెంగల నవీన్, దూస రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

బోయినపల్లి: ఆయిల్‌పామ్ సాగుకు రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించడంతో పాటు, సాగులో అధిక దిగుబడితో లాభాలు సాధించవచ్చని హార్టికల్చర్ అధికారి లోకేశ్, ఆయిల్‌పామ్ టెక్నికల్ మేనేజర్ కరుణాకర్‌రెడ్డిలు తెలిపారు. మండలంలోని నీలోజిపల్లి కొనుకటి అంజన్‌కుమార్ తోటలో మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సాగులో మెలకువలు, సస్యరక్షణ చర్యలు నీటి యాజమాన్యం పద్ధతులపై వివరించారు, 2022–23 సంవత్సరంలో సాగు చేసిన రైతులకు 2025 నాటికి దిగుబడి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ ప్రేమ్‌సాయిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ పులి లక్ష్మీపతి, సంబ లక్ష్మీరాజం, రామిడి శ్రీనివాస్, రైతులు ఎర్ర కిషన్, ఎర్ర బాల్‌రెడ్డి, కూస రవి, కమలాకర్, పెంతల రాజు తదితరులు ఉన్నారు.

బోరు తవ్వకం నిలిపివేత



బోరు తవ్వకాన్ని నిలిపివేస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని కిషన్‌దాస్‌పేటలో దేవయ్య అనే రైతు తన పొలం వద్ద బోరుబావి తవ్విస్తుండగా తహసీల్దార్ రామచంద్రం నిలిపివేశారు. సదరు రైతు అనుమతి లేకుండా బోరు వేస్తుండగా సమీపంలోని మహిళా రైతు ఎల్లవ్వ తన బోరుకు అతి సమీపంలోనే బోరు తవ్విస్తున్నారని తహసీల్దార్‌కు మంగళవారం ఫిర్యాదు చేసింది. దీంతో క్షేత్రస్థాయికి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌ను పంపించి విచారించగా.. అనుమతి లేకుండా బోరు వేస్తున్నారని నిర్ధారించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, బోరువెల్ యజమానులు తప్పకుండా వాల్టా చట్టం ప్రకారం అనుమతులు తీసుకోవాలని సూచించారు.

రైతు మహాపాదయాత్ర

వేములవాడఅర్బన్: కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కుమార్ చేస్తున్న రైతు మహాపాదయాత్రలో వేములవాడ బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహరావు, నాఫ్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

సర్వేకు సహకరించాలి



సర్వేను పరిశీలిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి: సమాజంలో అసమానతలను తొలగించేందుకు సమగ్ర సర్వేను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం మల్లిగడ్డ గ్రామంలో చేపట్టిన సమగ్ర సర్వేను మంగళవారం పరిశీలించి మాట్లాడారు. రాష్ట్రంలో విద్య, ఉపాధి, తదితర అంశాలకు సంబంధించిన రిజర్వేషన్ అమలు చేసేందుకు సర్వే ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రజలందరూ సర్వేకు వచ్చిన అధికారులకు సహకరించాలని కోరారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఇన్‌చార్జి ఎంపీడీవో బండి ప్రదీప్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి కవిత తదితరులు ఉన్నారు.

సర్వే పరిశీలన

వీర్నపల్లి: మండలకేంద్రంతో పాటు భూక్యతండా, బావుసింగ్‌నాయక్ తండాలో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను మంగళవారం తహసీల్దార్ మారుతి రెడ్డి పరిశీలించారు. అనంతరం రాశిగుట్ట తండాలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో రికార్డులు పరిశీలించారు. రైతులకు ఏమైనా ఇబ్బందులున్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

ఇల్లంతకుంట : మండలంలోని పలు గ్రామాల్లో సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతోంది. మండలంలో 17,798 హౌస్‌హోల్డ్స్ ను గుర్తించారు. 127 మంది ఎన్యుమరేటర్లు, 14 మంది సూపర్‌వైజర్లు సర్వేలో పాల్గొంటున్నారు. వెంకట్రావుపల్లిలో నాలుగు రోజులుగా గ్రామస్తులు సర్వేను బహిష్కరిస్తున్నారు.

వాహనాల తనిఖీ



డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష చేస్తున్న పోలీసులు

ఇల్లంతకుంట : మండలకేంద్రంలోని ఎస్సీకాలనీ చౌరస్తా వద్ద మంగళవారం ఎస్సై శ్రీకాంత్ గౌడ్ వాహనాల తనిఖీ నిర్వహించారు. మద్యంతాగి వాహనాలు నడపవద్దని ఎస్సై వాహనదారులకు సూచించారు. వారంరోజులుగా 18 మంది వాహనదారులు తనిఖీల్లో పట్టుబడగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా :
9951602934, 9010610963
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
సిరిసిల్ల : రఘు - 7331119957
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899